క్లుప్తంగా

ఆలయంలో అన్నదానం



కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రసిద్ధి శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎస్వీ రమణారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. స్వామి వారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. దాతలు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రాజు, నాగ

గంగాధరనెల్లూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన అప్పిరెడ్డికండ్రిగ వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, కార్వేటినగరంలోని బీసీ కాలనీకి చెందిన రాజు, నాగ ద్విచక్రవాహనంపై చిత్తూరు వైపు బయల్దేరారు. అదే సమయంలో గంగాధనెల్లూరు మండలంలోని అప్పిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో కార్వేటినగరానికి చెందిన రాజు, నాగకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మల్లప్పకొండకు రూ.5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి కుంభాభిషేకానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి రూ.5 లక్షల విరాళం పంపినట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎంపీ రెడ్డెప్ప చేతులమీదుగా గుడుపల్లె ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ కృష్ణమూర్తి, సర్పంచ్ అమర్‌నాథ్‌తో కలిసి అందజేశారు. ఈనెల 11,12,13 తేదీల్లో కుభాంభిషేక వేడుకలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వేడుకలకు మంత్రి పెద్దిరెడ్డి రానున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కారకాంపల్లెలో ధాత్రేయచౌదరి, చారాల గ్రామంలో వైద్యాధికారి వినయ్‌కుమార్ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మేమున్నామని..



పాడెలను మోసుకెలుతున్న గ్రామస్తులు

నగరి : కుటుంబ సభ్యులందరూ చనిపోవడం.. అయినవాళ్లు తీవ్రశోకంలో ఉండడం.. నాలుగు మృతదేహాలకు ఏకకాలంలో దహనక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఆ కుటుంబానికి రావడంతో ఆత్మబంధువులం తామున్నామంటూ సర్పంచ్‌తో పాటు గ్రామంలోని పెద్దలు, యువకులు ముందుకు వచ్చారు. నగరి మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద జాతీయ రహదారి శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిట్టపాళెంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన భూపాలన్(29), భార్య నీలావతి(26), కుమారుడు నితిన్(4), ఉమేష్(3) మృతి చెందిన విషయం తెలిసిందే. నాలుగు మృతదేహాలు చేరుకోగానే గ్రామం శోకసంద్రమైంది. బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో అంత్యక్రియల నిర్వహణలో గ్రామస్తులు మానవత్వాన్ని చాటుకున్నారు. పాడెలను శ్మశానం వరకు మోసుకువెళ్లారు. గ్రామ ఆచారం ప్రకారం మృతదేహాలను దహనం చేశారు.

పుత్తూరులో 987 కేసుల పరిష్కారం



పుత్తూరు: కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర



గుడ్ టచ్-బ్యాడ్ టచ్ ప్రదర్శన తిలకిస్తున్న జడ్జిలు



పుత్తూరు లోక్ అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జడ్జీలు

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 987 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.2,27,86,435 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 931 క్రిమినల్ కేసులు, 44 సివిల్, 12 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా న్యాయమూర్తులు ఎస్‌సీ.రాఘవేంద్ర, సి.జానకి, వి.గోపాలకృష్ణ, బెంచ్ మెంబర్లుగా న్యాయవాదులు ఎం.సంజీవి, కె.చంద్రశేఖర్, ఏడీ.బాలాజీ వ్యవహరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న విద్యార్థుల ప్రదర్శనలు

లోక్ అదాలత్ ప్రారంభానికి ముందు పుత్తూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల నిరోధం, పర్యావరణ పరిరక్షణపై చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

430 కేసులు పరిష్కారం

నగరి : పట్టణంలోని జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 430 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో టైటిల్ పార్టిషన్‌కు సంబంధిత 9 కేసులు, మున్సిపల్, ఎక్సైజ్, సీసీఐపీసీ, అడ్మిషన్‌కు సంబంధిత 53 కేసులు, సెకండ్ క్లాస్ కోర్టు అడ్మిషన్ కేసులు 319, బ్యాంకు సంబంధిత కేసులు 49 చొప్పున 430 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.66 లక్షల 587 రికవరీ అయ్యింది. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నెల్సన్, ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మణివాసగం, న్యాయవాదులు పాల్గొన్నారు.

తప్పు చేయకుంటే బాబుకు భయమెందుకు?



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: తప్పు చేయనప్పుడు చంద్రబాబునాయుడుకు భయమెందుకని, చట్టం ముందు అందరూ సమానమే అన్న విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అన్నారు. శనివారం ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ టీడీపీ నేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా టీడీపీ నాయకుల మాటలు, చేష్టలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. చట్టానికి చంద్రబాబేమీ అతీతుడు కాదన్న విషయాన్ని అనుచర వర్గం గుర్తించాలన్నారు. సీఐడీ విచారణలో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లభించిన నేపథ్యంలోనే ఆయన అరెస్ట్ జరిగిందని తెలిపారు. బాబు ఏతప్పు చేయకుంటే కోర్టులో తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని గౌరవించకుండా ప్రజలను, కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలని టీడీపీ నాయకులు యత్నించడం వారి దిగజారుడు రాజకీయానికి అద్దం పడుతోందన్నారు. అన్యాయాన్ని, అవినీతిని ప్రశ్నిస్తానంటూ సినిమా డైలాగులు చెప్పే పవన్‌కల్యాణ్ నిజాలను ఒప్పుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైంది



మాట్లాడుతున్న కేశవులునాయుడు

పుత్తూరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని, మానవీయ విలువలు..విద్యార్థులను తీర్చిదిద్దడంతో వారి పాత్ర శ్లాఘనీయమని సాహితీవేత్త కేశవులునాయుడు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేసేది గురువులేనని తెలిపారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్వాహకులు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 12 మందిని, సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త పురుషోత్తం ఆచారి, ఎస్టీయూ కౌన్సిల్ సభ్యులు నారాయణబాబు, ఎంఈఓ బాలసుబ్రమణ్యం, సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రాజు, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, రామలింగం, చంద్రశేఖర్‌వర్మ, రామ్మూర్తి, కృపావరమ్మ, మాలిని, రాజ్యలక్ష్మి, కుప్పయ్య, బాలసుబ్రమణ్యం, మురళి, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై జాగ్రత్తలు పాటించాలి



సూచనలిస్తున్న జిల్లా టీకా అధికారి రవిరాజు

కార్వేటినగరం: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. విషజ్వరాల్లో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా కలుషిత నీరు తాగడం వల్ల వైరల్ ఫీవర్ వస్తుందని, ప్రతి దానికి ఆర్‌ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను ఇంటి ఆవరణలో లేకుండా చూడాలని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా దోమల నివారణకు మిలాథిన్ స్ప్రే చేయించారు. వైద్యాధికారులు గోపినాథ్, యూసఫ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణి సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకుంటే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. వచ్చిన గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతోపాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని చెప్పారు. అనంతరం 37 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్



రికార్డులను పరిశీలిస్తున్న డీఈ వెంకటేశ్వర్

పాలసముద్రం : గృహ నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్ పంపిణీ చేస్తున్నామని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్ తెలిపారు. పాలసముద్రంలోని సిమెంట్ గోదామును శనివారం ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లు పెట్టాల్సిన బాధ్యత సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తోందని చెప్పారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్ ఇస్తున్నారని వివరించారు. ఏఈ దాము, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాల య సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ



గోపూజలో పాల్గొన్న గ్రామస్తులు

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఉదయం మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేసి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గోపూజ చేశారు. ఆవు, దూడను పూలమాలతో అలంకరించి, వస్త్రాలను సమర్పించారు. భజనల మధ్య గ్రామ వీధుల్లో ఆవు,దూడతో ఊరేగింపు జరిగింది. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి స్థల పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట మండలం గాజులమండ్యంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ మద్దెల గురుమూర్తి స్థల పరిశీలన చేశారు. గ్రామస్తుల వినతి మేరకు శనివారం ఆయన వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డితో కలసి గాజులమండ్యంకు చేరుకున్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వివరించారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, నాయకులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆనందరావ్, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, నారయ్యయాదవ్ పాల్గొన్నారు.

- ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయస్వామి
- ముస్తాబైన ఆలయం

రాజనాలబండలో తిరునాళ్ల సందడి





రాజనాలబండలో పూజలందుకున్న వీరాంజనేయస్వామి, భక్తులకు అన్నదానం

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరునాళ్ల సందడి మొదలైంది. శ్రావణమాస చివరి శనివారం, ఆదివారం తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. శనివారం మండలంలోని 18 గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో రాజనాలబండకు చేరుకుని శ్రీ వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి రాజనాలబండకు సమీపంలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన చేరుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపై రాత్రి అఖండ దీపం వెలిగించారు. భక్తులకు జీఆర్‌ఎస్ రమణ, వెంగళపల్లె యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈసందర్భంగా చేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ఆకట్టుకుంది. సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది బందోబస్తును ఏర్పాటుచేశారు.

నరసింహస్వామి కొండపై భక్తుల రద్దీ



అవగాహనతో మానసిక సమస్యలకు చెక్



ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

తిరుపతి తుడా: మానసిక సమస్యలను అవగాహనతో అధిగమించవచ్చని రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి తెలిపారు. రుయా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సే నోటు సూసైడ్ డోంట్ కిల్ యువర్ సెల్ఫ్ అన్న నినాదంతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ పిరికితనం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఒత్తిడిని అధిగమిస్తే మానసిక సమస్య దరిచేరదన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆర్థి క సమస్యలు, మన చుట్టూ ఉన్న అనేక సమస్యల కారణంగా ఎక్కువ మంది మానసికంగా కుంగిపోతున్నారని వివరించారు. ప్రేమ వ్యవహారాలు, కాంపిటేటివ్ పరీక్షలు, పోటీతత్వం వల్ల యువతలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. అవగాహన, కౌన్సెలింగ్, చికిత్స ద్వారా ధైర్యం పొందవచ్చన్నారు. తిరుపతి రుయాలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రి విభాగం మానసిక సమస్యలకు పరిష్కారవంతమైన చికిత్స అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భారతి, మనోజ్, రాఘవ, మహేష్, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం కౌన్సిలర్ జి.మురళి, ముకుంద నాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు



శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు శనివారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్సవాలు సాగుతాయి. చివరిరోజు 11వ తేదీ సాయంత్రం నిర్వహించే ముగింపు సమావేశంలో విజేతలకు రంగస్థలి పురస్కారాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం తొలి రోజు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించి సభికులను ఆకట్టుకున్నారు.